సాక్షి
బాపట్ల

బుధవారం । 14 । మే । 2025



భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

పొన్నూరు: పట్టణంలోని సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారి వసంతోత్సవం, చక్ర స్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



దుర్గమ్మ సన్నిధిలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్ర కీలాద్రిపై దుర్గమ్మకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.



తిరుపతమ్మకు బోనాలు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారికి మంగళవారం నాయీబ్రాహ్మణులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

న్యూస్‌రీల్

ఏఈఎల్‌సీ అడ్మినిస్ట్రేటర్‌గా విశ్రాంత న్యాయమూర్తి జోసెఫ్

నెహ్రూనగర్: ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి అడ్మినిస్ట్రేటర్‌గా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు కేరళ రాష్ట్రానికి చెందిన విశ్రాంత న్యాయమూర్తి జోసెఫ్ పీఎస్ నియమితులయ్యారు. ఏఈఎల్‌సీ రాజ్యాంగం ప్రకారం ఆమోదించబడిన అన్ని పాలక మండలలు, కమిటీలు ఏర్పడే వరకు అడ్మినిస్ట్రేటర్ కంట్రోలర్‌గా జోసెఫ్ వ్యవహరించనున్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్రాంత జూనియర్ జడ్జి నేలటూరి జేసు రత్నకుమార్ కంట్రోలర్ కార్యదర్శిగా నియమితులయ్యారు.

శ్రీ భక్తాంజనేయస్వామి గ్రామోత్సవం



యర్రబాలెం(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో వేంచేసి ఉన్న భక్తాంజనేయ స్వామి వారి విగ్రహ, జీవ, ధ్వజ, విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా మంగళవారం స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు పలు రకాల పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీ భక్తాంజనేయస్వామి వారిని ట్రాక్టర్‌పై అధిష్టంపచేసి పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

'ఎయిర్ కూలర్లు' ఏర్పాటు చేయిస్తాం..

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ స్ట్రోక్ యూనిట్‌లో పక్షవాత బాధితులు ఇబ్బంది పడకుండా వేసవి ఎండ నుంచి ఉపశమనం కోసం ఎయిర్ కూలర్లు తక్షణమే ఏర్పాటు చేయిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ తెలిపారు. జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో పక్షవాత రోగులకు చికిత్స అందించే స్ట్రోక్ యూనిట్‌లో ఏసీలు పనిచేయక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంగళవారం 'సాక్షి' జిల్లా ఎడిషనల్‌లో రోగులకు సన్ 'స్ట్రోక్' శీర్షిక పేరుతో కథనం ప్రచురితమైంది. కేవలం స్ట్రోక్ బాధితులే కాకుండా చికిత్స అందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది కూడా ఏసీలు పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఏసీలు మరమ్మతులు చేసినప్పటికీ మరలా పనిచేయడం మానేశాయి. ఈవిషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రోగులు సొంతంగా ఫ్యాన్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇస్తామని వెల్లడించారు.

ఉండవల్లి కొండపై మంటలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి కొండపై మంగళవారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టి ఉండవచ్చని, లేదా ఈ వేసవి ఎండల కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంటలు తీవ్రస్థాయిలో ఎగిసిపడుతుండడంతో దిగువ భాగాన నివాసముంటున్న వారు భయాందోళనలకు గురవుతున్నారు. సుమారు 2 గంటలపాటు వ్యాపిస్తూనే ఉన్నాయి. స్థానికులు ఈ ఘటనపై అధికారులకు సమాచారం అందజేశారు.

రైతన్నలకు కూటమి దగా

- మాజీ మంత్రి, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మేరుగు నాగార్జున
- రైతు సంక్షేమానికి తూట్లు పొడుస్తున్న కూటమి ప్రభుత్వం



విలేకరులతో మాట్లాడుతున్న మేరుగ నాగార్జున, పక్కన గాదె మధుసూదనరెడ్డి



ఆత్మహత్యాయత్నం చేసుకున్న శ్యాంసన్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున, నియోజక వర్గ కన్వీనర్ గాదె మధుసూదనరెడ్డి

పర్చూరు(చినగంజాం): రాష్ట్రంలో రైతులు అధైర్యపడొద్దని ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని.. మనోధైర్యంతో మెలగాలని.. వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున అన్నారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు ఉప్పుటూరు సాంబశివరావు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇంకొల్లు మండలం దుద్దుకూరుకు చెందిన మరో రైతు బిల్లా శ్యాంసన్ కుటుంబాలను పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డితో కలసి నాగార్జున పరామర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి తూట్లు పొడుస్తోందన్నారు. వీరన్నపాలేనికి చెందిన ఉప్పుటూరు సాంబశివరావు బీసీ కులానికి చెందిన పేదవాడు అని.. కౌలుకు తీసుకున్న డబ్బులు కట్ట లేక, పంట అమ్ముకోలేక ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఆనాడు దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా చేస్తే.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయం దండుగ అనే ధోరణిలోని పాలన సాగిస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పేదలు వ్యవసాయం చేస్తూ.. గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అయినా ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఇక్కడకు వచ్చినా ఎలాంటి సహాయం అందలేదంటే ప్రభుత్వ తీరు ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహనరెడ్డి రూ.2 వేల కోట్లు పొగాకు రైతుకిచ్చి ఆదుకున్నారన్నారు. రైతులకు రైతు భరోసా అందించి జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని తెలిపారు.

కానీ కూటమి ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకుండా రైతులను మభ్యపెడుతుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు భరోసా అందించి అండగా నిలవాలని కోరారు. రైతుల తరపున పోరాడేందుకు మాజీ సీఎం జగన్ ఈ ప్రాంతానికి రావాల్సిందిగా కోరనున్నట్లు తెలిపారు.

జగన్ ఆదేశాలతో పర్యటనలు

అనంతరం పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి గ్రామానికి వెళ్లి రైతుల బాధలు తెలుసుకొని వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కమిటీల పేరుతో తాత్సారం చేయకుండా తక్షణమే కంపెనీల ద్వారా కొనిపించడమో లేదా స్వయంగా ప్రభుత్వం కొనుగోలు చేయడమో చేయాలని కోరారు. ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారని.. తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారంతా సుఖపడతారన్నారు.

ఆయా గ్రామా ల్లోని పొగాకు నిల్వలను వారు పరిశీలించారు. పార్టీ నాయకులు భవనం శ్రీనివాసరెడ్డి, మార్టూరు, కారంచేడు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, జువ్వా శివరాంప్రసాద్, గర్నెపూడి రవిచంద్, ముప్పాళ్ల రాఘవయ్య, పాదర్తి ప్రకాష్, బిల్లా డేవిడ్ వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యంత్రాలతో ఇసుక తవ్వకాలపై

ప్రజల ఆందోళన

- గాజుల్లంక ఇసుక క్వారీ వద్ద ఆర్డీఓ పరిశీలన
- మైనింగ్ అధికారుల తీరుపై ఆవేదన

కొల్లూరు: కృష్ణా నదిలో చేపడుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రజలు అధికారుల ఎదుట ఆందోళన వ్యక్తంచేశారు. కృష్ణా నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడటంపై పత్రికల్లో వెలువడుతున్న కథనాలకు తోడు, గాజుల్లంకకు చెందిన వ్యక్తులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడంతో మంగళవారం రాత్రి రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి, డీఎస్పీ ఎ. శ్రీనివాసరావులు గాజుల్లంక వద్ద ఇసుక క్వారీలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లకుండానే అధికారులు బాపట్ల–కృష్ణా జిల్లాల నడుమ రాకపోకలకు ఏర్పాటు చేసిన బాటలో ఆగి లారీలను నిలువరించి ప్రశ్నిస్తున్న సమయంలో ప్రజలు అధికారులను చుట్టుముట్టి తమ గోడు వినిపించారు. తమ పట్టా భూముల్లో సైతం తవ్వకొని తరలిస్తున్నారని ఆర్డీవో ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. భారీ యంత్రాలతో గ్రామం వెంబడి తవ్వకాలు జరుపుతుండటం, నిర్దేశించిన పరిమాణాలను మించి ఇసుక తవ్వకొని తరలిస్తుండటం కారణంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, సముద్రపు నీరు చొచ్చుకొని వస్తున్నాయని అన్నారు. పశువులు తాగేందుకు సైతం చుక్క నీరు లేకుండా పోయిందని వాపోయారు. ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రాంతం మైనింగ్ శాఖ నిర్దేశించిన ప్రదేశంలో జరగడం లేదని, కనీసం హద్దులు సైతం ఏర్పాటు చేయలేదని మైనింగ్ శాఖాధికారులను స్థానికులు ప్రశ్నించారు. దీనిపై మైనింగ్ శాఖాధికారులు తాము హద్దులు నిర్ణయించామని, తమ సిబ్బందిని నియమించామని ఎల్లప్పుడూ తాము ఇక్కడ ఉండలేమని బాధ్యతారాహిత్య సమాధానం చెప్పడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ ఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతుంటే చర్యలు తీసుకోకుండా ఇటువంటి సమాధానాలు చెప్పడం ఏమిటని ప్రశ్నించడంతో, ఇకపై గాజుల్లంకలో ఉచిత ఇసుక క్వారీ నిర్వహణ జరగదని, కేవలం డంపింగ్‌కు మాత్రమే తవ్వకాలు జరుగుతాయని మైనింగ్ శాఖాధికారులు దాటవేత సమాధానంతో సరిపెట్టారు. నదిలో యంత్రాలున్నాయని స్థానికులు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణం యంత్రాలను సీజ్ చేయాలని ఆమె అధికారులను ఆదేశించిచారు. కార్యక్రమంలో వేమూరు సీఐ పీవీ.ఆంజనేయులు, వేమూరు ఎస్ఐ రవికృష్ణ, కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గాజుల్లంక సమీపంలో ఇసుక క్వారీ వద్ద పరిశీలిస్తున్న రేపల్లె ఆర్డీఓ, రేపల్లె డీఎస్పీ, మైనింగ్, రెవెన్యూ అధికారులు

'జంజనం'కు ఆశాభంగం

- వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీకి జంప్ అయిన చైర్మన్
- చైర్మన్ రేసులో కూటమి కౌన్సిలర్లు
- మూడో వంతు కౌన్సిలర్ల మద్దతు దొరుకుతుందా..?
- నేడు మున్సిపల్ చైర్మన్ అవిశ్వాసంపై ఓటింగ్



మున్సిపల్ కార్యాలయం

చీరాల: చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తన చైర్మన్ పదవిని కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. తమ వెంటే ఉండే కౌన్సిలర్లు రూటు మార్చి టీడీపీకి మద్దతు తెలపడంతోపాటు ఆయనపైనే అవిశ్వాసం తీర్మానం పెట్టడంతో చైర్మన్ కుర్చీని సొంతం చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నెగ్గుతారా... భంగపడతారా అనేది బుధవారం జరగనున్న అవిశ్వాస ఓటింగ్‌తో తేలనుంది.

22 మంది సంతకాలు

చీరాల మున్సిపల్ చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ నుంచి జంజనం శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయనపై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో మొత్తం 22 మంది సంతకాలు చేసిన వినతిపత్రాన్ని కలెక్టర్ జె.వెంకటమురళికి అందించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 4వ వార్డు కౌన్సిలర్ గోలి జగదీష్, 12వ వార్డుకు చెందిన మామిడాల రాములు, 20వ వార్డుకు చెందిన శిఖాకొల్లి రామసుబ్బులు టీడీపీకి మద్దతు తెలపగా టీడీపీ మద్దతుదారుల సంఖ్య 17కు చేరింది. మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గానికి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు కూడా టీడీపీకి మద్దతు పలికారు. దీంతో సంఖ్యా బలం 22కు చేరుకుంది. ఎమ్మెల్యేతోపాటు ఎంపీ ఓట్లు కూడా ఉన్నాయి. వారితో కూడా కలిపి చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సంఖ్యాబలం 24 ఉంది.

ఏమవుతుంది?

మున్సిపల్ చైర్మన్ జంజనం అవిశ్వాస తీర్మానంలో నెగ్గుతారా.. భంగపడతారా అనేది ఉత్కంఠగా మారింది. వైఎస్సార్‌సీపీ నుంచి చైర్మన్‌గా ఎన్నికైన ఆయన ఇటీవల టీడీపీలో చేరారు. టీడీపీలో చేరినా అవిశ్వాసంపై కూటమి కౌన్సిలర్లు పట్టుగానే ఉన్నారు. చీరాల మున్సిపాలిటీలో మొత్తం 33 మంది కౌన్సిలర్లున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు కలుపుకుని 35 ఓట్లున్నాయి. ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న జంజనంకు 1/3 అంటే 13 ఓట్లు మాత్రమే అవసరం ఉండగా, నూతనంగా అధికారం నెగ్గాలంటే 2/3 అంటే కనీసం 23 ఓట్లు ఉండాల్సి ఉంది. కానీ అవిశ్వాసంపై కూటమికి మద్దతు పలికిన కౌన్సిలర్లు పట్టు తగ్గకుండా ఉన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు తమ వైపునకు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అలానే తననే చైర్మన్‌గా కొనసాగించాలంటూ జంజనం టీడీపీ పెద్దలను కలుస్తున్నారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి చేరడం వలన తనకు ఏమాత్రం పదవీ గండం ఉండదనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాత్రం తమ మద్దతు టీడీపీ కౌన్సిలర్లకే ఉంటుందని ఖరారు చేశారు.

ఎవరి ప్రయత్నం వారిది

చైర్మన్‌గా తమనే ఎంపిక చేయాలంటూ ఎవరికి వారు ప్రయత్నాల్లో ఉన్నారు. చైర్మన్ రేసులో కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, దాసరి శారద, గోలి స్వాతి, పొత్తూరి సుబ్బయ్య తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. బుధవారం వారి భవితవ్యం తేలనుంది.

మరణంలోనూ ఒకరికొకరై..

- వినుకొండ రూరల్ మండలం శివాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- వ్యవసాయ కూలీల వాహనాన్ని ఢీకొన్న లారీ
- ఘటనలో వ్యవసాయ కూలీలైన రెండు జంటలు మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఇద్దరు ప్రకాశం జిల్లా వాసులు
- మరో ఇద్దరు వెల్దుర్తి మండలం దావుపల్లి తండావాసులుగా గుర్తింపు
- మృతుల బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలతో వినుకొండ ప్రభుత్వాసుత్రిలో విషాద ఛాయలు



వినుకొండ ప్రభుత్వాసుపత్రి వద్ద రోదిస్తున్న పగడాల రమణారెడ్డి కుమార్తెలు, కుమారుడు, బంధువులు

వినుకొండ: పొట్టకూటికోసం వలస వెళుతూ.. రోడ్డు ప్రమాదంలో రెండు జంటలు మృతిచెందిన ఘటన వినుకొండ రూరల్ మండలం శివాపురం వద్ద జరిగింది. మృతుల్లో ఇద్దరు ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోని గడ్డమీదిపల్లెవాసులుకాగా, మరో ఇద్దరు పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం దావుపల్లి తండా వాసులుగా గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. గడ్డమీదిపల్లె గ్రామం నుంచి ఆరుగురు వ్యవసాయ కూలీలు బొప్పాయి పంట కోసేందుకు బొలేరో వాహనంలో పల్నాడుజిల్లా ఈపూరుకు బయలుదేరారు. గుంటూరు – కర్నూలు జాతీయ రహదారిపై మార్గమధ్యంలో వినుకొండ రూరల్ మండలం శివాపురం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కొబ్బరిబొండాల లారీ బొలేరోలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో పగడాల రమణారెడ్డి(45), భార్య సుబ్బమ్మ(40), జొన్నగిరి రామాంజీ(35) భార్య అంకమ్మ(28)లు మృతి చెందారు. లారీలో ఉన్న మరో ముగ్గురు కన్నెబోయిన నాగమణి, పగడాల శివమ్మ, డ్రైవరు కదిరి నాగేశ్వరరావులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారు వినుకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పగడాల సుబ్బమ్మ, అంకమ్మలు ఘటనా స్థలంలోనే మృతి చెందగా పగడాల రమణారెడ్డి, జొన్నగిరి రామాంజీలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు. సమాచారం తెలుసుకున్న వినుకొండ పోలీసులు ఘటనాప్రాంతానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద వార్త తెలుసుకుని మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు వినుకొండ ఆస్పత్రికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. మృతుల బంధువుల రోదనతో ఆస్పత్రి వద్ద విషాద ఛాయలు అలుముకున్నాయి.

మిన్నంటిన రోదనలు

పగడాల రమణారెడ్డి, సుబ్బమ్మలకు ముగ్గురు సంతానం. మొదటి కుమార్తె అరుణ కుమారికి వివాహం కాగా రెండవ కుమారుడు రమణారెడ్డి బీటెక్ కంప్లీట్ చేశాడు. అలాగే చివరి కుమార్తె నబిత ఇంటర్ పూర్తిచేసింది. ప్రమాదం జరిగిన మూడు గంటల తర్వాత ఆసుపత్రి వద్దకు చేరుకున్న కుమార్తెలు, కుమారుడు రోదిస్తున్న తీరు చూపరులచే కంటతడి పెట్టించింది. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ, కష్టపడుతూ తమకు కష్టం తెలీకుండా చూసుకునే తల్లిదండ్రులు ఇలా విగతజీవులుగా మారతారని తాము కలలో సైతం ఊహించలేదంటూ వారు పెట్టిన రోదనలు ఆస్పత్రిలో మిన్నంటాయి.

- అలాగే మరో కుటుంబం జొన్నగిరి రామాంజీ, అంకమ్మలకు ఐదు, మూడు సంవత్సరాల కుమారులు ఉన్నారు. ఇంకా ఊహ కూడా తెలీకముందే పిల్లలు అనాథలుగా మారారని, ఇక వారికి దిక్కెవరంటూ బంధువులు పెద్ద పెట్టున రోదించారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు మృతదేహాలను సందర్శించి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

దావుపల్లి తండాలో విషాద ఛాయలు



తండాకు తీసుకొచ్చిన రామాంజీ, అంకమ్మల మృతదేహాలు

వెల్దుర్తి: మండలంలోని దావుపల్లితండాకు చెందిన జొన్నగిరి రామాంజీ దంపతులు కూలీ పనుల నిమిత్తం మంగళవారం తెల్లవారుజామున యర్రగొండపాలెం వెళ్లి అక్కడ నుంచి బొలేరో వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో శివాపురం వద్ద అకస్మాత్తుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వారు మృతిచెందారు. విషయం తెలుసుకున్న తండావాసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను దావుపల్లితండాకు తీసుకొచ్చారు. మృతదేహాలు రాగానే ఒక్కసారిగా తండా రోదనలతో దద్దరిల్లింది. వీరికి ఐదు సంవత్సరాల పవన్, మూడు సంవత్సరాల చైతన్య అనే కుమారులున్నారు. పవన్‌కుమార్ 1వ తరగతి చదువుతుండగా చైతన్య ఇంటి వద్దే ఉంటున్నాడు. తల్లిదండ్రులు చనిపోయిన విషయం తెలియగానే పవన్‌కుమార్ రోదిస్తుండగా.. చైతన్య దిక్కులు చూస్తున్నాడు. వీరికి తాతయ్య మాత్రమే ఉన్నాడు. పేద కుటుంబం కావటంతో వీరికి ఎవరూ దిక్కు లేకపోవటంతో తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామాంజీ, అంకమ్మలు రెక్కాడితేకానీ డొక్కాడని పరిస్థితులలో ప్రతిరోజూ కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. పనులకు వెళ్తానే పిల్లలను చూసుకుంటూ పవన్‌కుమార్‌ను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నారు. సంఘటన తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి దావుపల్లితండాకు వెళ్లి రామాంజీ, అంకమ్మల మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘటన వివరాలు తెలుసుకొని సంతాపం వ్యక్తం చేశారు.

చిన్నారుల భవితవ్యం అగమ్యగోచరం..



కుమారులు పవన్, చైతన్య

చిన్న వయసులోనే తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందటంతో చిన్నారులు పవన్, చైతన్యల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. వీరికి ఎవరూ బంధువులు లేకపోవటంతో తాతయ్య వృద్ధుడు కావటంతో వీరి భవిష్యత్తు ఏమవుతుందోనని తండావాసులు చర్చించుకుంటున్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవటంతో దిక్కుతోచని స్థితిలో చిన్నారులు రోదిస్తున్నారు. వీరిని చూసిన తండావాసులు కంటతడి పెడుతున్నారు.

20 సూత్రాల అమలుకు చిత్తశుద్ధితో పని చేయాలి

లంకా దినకర్‌బాబు



మాట్లాడుతున్న లంకా దినకర్‌బాబు

బాపట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఏపీ చైర్మన్ లంకా దినకర్ బాబు అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు, పురోగతి, మౌలిక సదుపాయాల కల్పనలో 20 సూత్రాల కార్యక్రమాల అమలు తీరుపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, డ్వామా, డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, గృహ నిర్మాణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ, విద్యుత్, పబ్లిక్ హెల్త్, మెప్మా, పర్యాటక శాఖలపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంతో అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా జీడీపీ 11.2 శాతం ఉండగా, రానున్న ఏడాదిలో 15 శాతానికి చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. అభివృద్ధి వైపు బాపట్ల జిల్లా అడుగులు వేయాలంటే క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చాలా ముఖ్యమన్నారు. నీతి ఆయోగ్ సూచనలను పరిగణనలోకి తీసుకుని వాటికి అనుగుణంగా పని చేయాల్సి ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు విస్తీర్ణం పెరిగితే, రసాయనాల వినియోగం పూర్తిగా అరికట్టవచ్చన్నారు. సూర్యలంక, రామాపురం, మోటుపల్లి బీచ్‌లు అభివృద్ధి చెందితే స్వర్ణాంధ్రప్రదేశ్‌లో బాపట్ల జిల్లాను భాగస్వామ్యం చేయవచ్చన్నారు. పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రాయోజిత స్వదేశీ దర్శన్ పథకం క్రింద సూర్యలంక బీచ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ.97.52 కోట్లు మంజూరయ్యాయన్నారు. సూర్యలంక, రామాపురం బీచ్‌ల 'బ్లూ ఫ్లాగ్' స్టేటస్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పీఎం ఫసల్ బీమా పథకంపై అవగాహన కల్పించకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. కలెక్టర్ జె.వెంకట మురళి, డీఆర్వో జి గంగాధర్‌గౌడ్, సీపీఓ కె శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రేపల్లె: రైతులు ప్రభుత్వ పథకాలను సద్విని యోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ నాంచారయ్య అన్నారు. పట్టణంలోని పశు వైద్యశాలలో పశు యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన దాణాను మంగళవారం ఆయన పంపిణీ చేసి, మాట్లాడారు. పశువులకు 50 శాతం రాయితీపై దాణా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. యజమానులు తమ పశువుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, పశు వైద్యాధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

20న రాష్ట్ర స్థాయి ఎద్దుల పోటీలు

కారంచేడు: ఈ నెల 20వ తేదీన గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లను పురస్కరించుకొని గ్రామంలో రాష్ట్ర స్థాయి ఎద్దుల పరుగు పందెం పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ. 5 వేలు చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు దుర్గారావు 77308 30949, సాయికిరణ్ 63001 50488, నంగనం తేజ 80742 60245 ఫోను నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కోడి గుడ్ల లారీ బోల్తా



జె.పంగులూరు: మండల పరిధిలోని ముప్పవరం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం అదుపు తప్పిన కోడి గుడ్ల లారీ బోల్తా పడింది. బోయపాలెం నుంచి టంగుటూరు వెళుతుండగా, ముందున్న వాహనాన్ని క్రాస్ చేయబోయి అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్‌తోపాటు లారీ క్యాబిన్‌లో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. కోడిగుడ్లు రోడ్డుపై పడి పగిలిపోయాయి. అప్రమత్తం అయిన హైవే సిబ్బంది ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అద్దంకి: మండలంలోని శింగరకొండ దేవస్థానం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం అయినట్లు సీఐ సుబ్బరాజు మంగళవారం తెలిపారు. అతడి వయసు సుమారు 45 - 50 సంవత్సరాల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

లే అవుట్ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: లే అవుట్‌ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో బాపట్ల మున్సిపాలిటీ, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లే అవుట్‌లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. 2019 నుంచి బాపట్ల మున్సిపాలిటీ, బావుడా పరిధిలోని తొమ్మిది మండలాలలో మొత్తం 183 అనధికార లే అవుట్లను గుర్తించి వాటి వివరాలను డీటీసీపీకి పంపినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అందులో 86 లే అవుట్లను 22–ఎ కింద గుర్తించి రిజిస్ట్రేషన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు తెలియజేశామని, మిగిలిన 97 లే అవుట్లను సబ్ డివిజన్‌లుగా చేసి పంపాలని వాటిని తిప్పి పంపారని వారు కలెక్టర్‌కు వివరించారు. 97 లే అవుట్లకు సంబంధించి సర్వే నెంబర్లు వారీగా ఆయా తహసీల్దార్లతో సబ్ డివిజన్ చేయించి వాటి వివరాలను బావుడాకు తెలియజేయాలని రెవెన్యూ డివిజన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆ వివరాలను డీటీసీపీకి పంపి రిజిస్ట్రేషన్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త లేఅవుట్ల అనుమతులకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలో, పంచాయతీలలో గృహ నిర్మాణాలకు అనుమతులకు సంబంధించి ప్రభుత్వం సూచించిన నియమాలను బావుడా అధికారి వివరించారు. ఎవరైనా గృహాలు నిర్మించుకోవాలనుకునేవారు వారి దరఖాస్తులను పంచాయతీరాజ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా మాత్రమే చేసుకోవాలన్నారు. సమావేశంలో డీపీఓ ప్రభాకర్, బాపట్ల, చీరాల, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, బాపట్ల, రేపల్లె, అద్దంకి, చీరాల మున్సిపల్ కమిషనర్లు, బావుడా ప్లానింగ్ అధికారి షేక్ ఖలీషా, లైసెన్స్ టెక్నికల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

మోటుపల్లి ప్రాచీన ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తీసుకురావాలి

మోటుపల్లి ప్రాచీన ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తెస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మోటుపల్లి గ్రామం, మ్యూజియం నిర్మాణం, వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. కాకతీయులనాటి అభయ శాసనాలను తెలుగులోకి అనువదిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ప్రాచీన వైభవం తెచ్చేలా ఆలయం అభివృద్ధి చేస్తామన్నారు. కోదండరామ దేవాలయానికి సమీపంలోని 5.8 ఎకరాల భూమిని ఆలయానికి కేటాయిస్తున్నట్లు తెలిపారు. కాకతీయులు, చోళుల నాటి శాసనాలు, పంచలోహాలను చిన్నగంజాంలోనే భద్రపరచడానికి మ్యూజియం నిర్మించాల్సి ఉందని తెలిపారు. మ్యూజియం నిర్మాణంపై పురావస్తు శాఖకు సమగ్ర నివేదికతతోపాటు లేఖ పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతానికి చెందిన ప్రాచీన సంపద ప్రస్తుతం హైదరాబాద్ మ్యూజియం, చెన్నై మ్యూజియం, విజయవాడ మ్యూజియంలో ఉందన్నారు. వాటిని తెప్పించడానికి దస్త్రాలను సిద్ధం చేయాలన్నారు. వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధితో మోటుపల్లి మరింత ప్రాచుర్యం పొందనుందన్నారు. సమావేశంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సూర్యప్రకాశరావు, చిన్నగంజాం తహసీల్దార్ ప్రభాకర్‌రావు, మోటుపల్లి అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూలీల వలసలు నివారించాలి

- వినుకొండ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: తీవ్ర కరువు, కాటకాలతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంత ప్రజలు కూలీ పనుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారని, ఈ ప్రయాణంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గడ్డమీదిపల్లె గ్రామానికి చెందిన కూలీలు బొప్పాయి కోతల కోసం వెళ్తూ పల్నాడు జిల్లా వినుకొండ మండలం శివాపురం గ్రామానికి సమీపంలోని హైవే రోడ్డుపై జరిగిన ప్రమాదంలో నలుగురు మరణించారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే మంగళవారం ఆయన గడ్డమీదిపల్లెకు వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతులకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. దీంతో రైతులు అప్పుల పాలయ్యారని, ఈ కారణాలతో ఎకరాలకొద్దీ ఉన్న రైతులు సైతం కూలీ పనులు చేసుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నారన్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు కూడా సక్రమంగా జరగడం లేదని, ఆ నిధులను కూడా కూటమి నాయకులు మెక్కేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. పనులు కల్పించకపోవడంతోనే గడ్డమీదిపల్లెకు చెందిన 300 కుటుంబాలు వలసలు వెళ్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థవుతోందన్నారు. మృతుల కుటుంబాలను పరిశీలిస్తే కూలీ పనుల కోసం దూర ప్రాంతాలకు ఎందుకు వెళ్తున్నారనే విషయం అర్థం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం యర్రగొండపాలెం మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించకపోవడం వల్లే వలస వెళ్లక తప్పడం లేదన్నారు. వలసలు నివారించాలంటే వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుకు వెంటనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి, ప్రాజెక్ట్‌కు నీళ్లు వదలడమే సరైన మార్గమన్నారు. ఈ మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, మృతుల కుటుంబాలకు భారీగా ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అన్నం రామ్మోహనరావు



ఆర్టీసీ డిపోలో ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

బాపట్ల టౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అన్నం రామ్మోహనరావు తెలిపారు. ఎన్ఎంయూ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఆర్టీసీ కార్యాలయం ముందు అద్దంకి, చీరాల, బాపట్ల, రేపల్లె డిపోల పరిధిలోని నాయకుల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత ఆదేశాలను వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అమలు పరచాలన్నారు. అక్రమ సస్పెన్షన్ల రద్దు చేసి, తిరిగి ఉద్యోగం ఇవ్వాలన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీహెచ్ఎస్ స్థానంలో ఆర్టీసీకి పాత వైద్య విధానాన్ని అమలు పరచాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ, ప్రభుత్వమే కొని ఉద్యోగులతో నడిచేలా చూడాలని పేర్కొన్నారు. నైట్ అవుట్ అలవెన్సులు రూ.150 నుంచి రూ.450కు పెంచాలన్నారు. సిక్ లీవులకు పూర్తి జీతం చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వైఎస్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి తులసి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు పెంచలయ్య, గాంధీ ఆశాబాబు, జిల్లాలోని నాలుగు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీడీపీఓ సుచిత్ర

రేపల్లె: బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని సీడీపీఓ సుచిత్ర చెప్పారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఉప్పుడి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం సమ్మర్ ప్రత్యేక క్యాంపులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను గ్రామీణులకు తెలియపరచాలన్నారు.. యువతికి 18 ,యువకునికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని చెప్పారు. బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు. అలా చేస్తే రూ. లక్ష జరిమానా, రెండు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని తెలియజేశారు. 2 సంవత్సరాలు దాటిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించడంతో పాటు ఐదు సంవత్సరాలు దాటిన వారిని పాఠశాలలకు పంపేలా బాధ్యత వహించాలన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, విద్యా హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. కిశోరి బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి. నాంచారమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



మాట్లాడుతున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణతో పాటు భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, పరిపాలన అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హెనీ క్రిస్టినా మాట్లాడుతూ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు, జెడ్పీకి రావాల్సిన ఆదాయం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, రేవుల వేలం, షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి రావాల్సిన బకాయిలపై మండలాల వారీగా వివరాలు సేకరించారు. జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న కల్యాణ మండపాలు, దుకాణాల నుంచి అద్దెలు, లీజు బకాయిలను వసూలు చేయాలని తెలిపారు. జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు జెడ్పీకి రావాల్సిన ఆదాయ వనరులు, బకాయిలకు సంబంధించి మండలాల వారీగా సమీక్షించారు. డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ ప్రతినెలా ఇవ్వాల్సిన నివేదిక వివరాలను క్రమం తప్పకుండా పంపాలని సూచించారు. వార్షిక అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ రిపోర్ట్, పెండింగ్‌లో ఉన్న బకాయిలు, న్యాయస్థానాల్లో ఉన్న కేసుల వివరాలను సేకరించారు. వివిధ అంశాలపై పరిపాలనాధికారులు పూర్ణచంద్రారెడ్డి, శోభారాణి, తోట ఉషాదేవి నివేదిక సమర్పించారు. సమావేశంలో అకౌంట్స్ అధికారి శామ్యూల్‌పాల్, ఎంపీడీఓలు, ఏఓలు పాల్గొన్నారు.

కార్డులు జారీ చేయకుండా 'సుఖీభవ' ఎలా?

- కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య
- జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా.. జేసీకి వినతిపత్రం



కలెక్టరేట్‌లో నినాదాలు చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

లక్ష్మీపురం: గుర్తింపు కార్డులు జారీ చేయకుండా అన్నదాత సుఖీభవ పథకాన్ని ఏలా అమలు చేస్తారని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రశ్నించారు. జిల్లా కలెక్టరేట్ వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కౌలురైతులకు కూడా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని చెప్పటం నమ్మదగ్గ విషయం కాదన్నారు. గత సంవత్సరం జారీ చేసిన గుర్తింపు కార్డులకు కాల పరిమితి ముగిసిందనీ, ఈ ఏడాది కొత్తగా కౌలుగుర్తింపు కార్డులు జారీ చేయకుండా అన్నదాత సుఖీభవ పథకం ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంజుల రెడ్డి, పీవీ జగన్నాథం మాట్లాడుతూ కౌలు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. ఏపీ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ మాట్లాడుతూ అప్పుల బాధతో చనిపోయిన కౌలురైతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజకు వినతిపత్రం అందజేశారు. కౌలు రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారిని ఆదుకోవడానికి అన్ని చర్యలు చేపడతామని జిల్లా జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు కంచుమాటి అజయ్, కౌలురైతుల సంఘం నాయకులు బి.రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులు కాపాడాలి



నరసరావుపేటటౌన్: ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి అల్లూరయ్య మాట్లాడుతూ వినియోగదారుల దిన వారోత్సవాల్లో భాగంగా కల్తీలు, తూకాల్లో వ్యత్యాసాలపై వివిధ రూపాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా చట్టప్రకారం నడుచుకోవాలన్నారు. వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చట్టపరమైన అంశాలను వివరించారు. నరసరావుపేట, సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్‌లు సాయి శ్రీకర్, జాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పాఠశాలల లాగిన్ ద్వారా హెచ్‌ఎంలు, www.bse.ap.gov వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు నేరుగా తమ హాల్‌టికెట్లను పొందవచ్చని వివరించారు. అలాగే 9552300009 నెంబర్‌కు పాఠశాల పేరు, విద్యార్థి పేరు, జిల్లా, పుట్టిన తేదీ వివరాలతో వాట్సాప్‌లో 'హాయ్' అనే మెసేజ్ పంపటం ద్వారా హాల్‌టికెట్లు పొందవచ్చని తెలిపారు. కాగా, జిల్లాలోని అన్ని యాజమాన్యాల హెచ్‌ఎంలు తమ పాఠశాల లాగిన్ ద్వారా మార్చిలో నిర్వహించిన టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల షార్ట్ మెమో (మార్క్‌లిస్ట్)లను డౌన్‌లోడ్ చేసి తమ సంతకాలతో విద్యార్థులకు అందించాలని తెలిపారు. షార్ట్‌మెమోలో ఏవైనా తప్పులు ఉన్నట్లయితో ప్రధానోపాధ్యాయులచే ధ్రువీకరించి ఈనెల 25వ తేదీ లోగా విజయవాడ (గొల్లపూడి)లోని ప్రభుత్వ పరీక్షల విభాగం, డైరెక్టర్ కార్యాలయం ద్వారా సరిచేసుకోవాలని సూచించారు.

దూరవిద్య సప్లిమెంటరీ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్మీడియెట్, 10వ తరగతి దూరవిద్య అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం తెలిపారు. పరీక్షలు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యేవారు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా నేరుగా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అలాగే మన మిత్ర వాట్స యాప్ ద్వారా ఏజీ మెసేజ్‌ను 9552300009 నెంబర్‌కు పంపి హాల్‌టికెట్ పొందవచ్చని వివరించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి



గుంటూరు రూరల్: రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని బండారుపల్లి, నల్లపాడు రైల్వేస్టేషన్‌ల మధ్య చోటు చేసుకుంది. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 10 గంటల సమయంలో రేపల్లే నుంచి చర్లపల్లి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి వృద్ధుడు మృతి చెందాడు. మృతుని వయస్సు సుమారుగా 65 నుంచి 70 సంవత్సరముల మధ్య ఉంటుందని, తెల్లజుట్టు, తెలుపు రంగు ఆఫ్ చేతుల చొక్కా, తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడని, ఎరుపు రంగు మొలతాడు కట్టుకుని ఉన్నాడన్నారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు, నడికుడి గవర్నమెంట్ రైల్వే పోలీసువారిని సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు నడికుడి రైల్వే పోలీసు స్టేషన్ ఎస్ఐ రోశయ్య 8309369916, 9949063960 సెల్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి



కారంచేడు: ఉపాధి పనుల నిమిత్తం వెళ్లి వడదెబ్బతో కుప్పకూలిన వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండల కేంద్రమైన కారంచేడు యజ్ఞశాలపేటకు చెందిన చెరుకూరు ఆదినారాయణ (64) వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఎప్పటి మాదిరిగానే మంగళవారం కూడా ఉపాధి పనులకు వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో దారిలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. తోటి కూలీలు గమనించి స్థానిక ఆర్‌ఎంపీకి సమాచారం అందించారు. ఆయన పరిశీలించి మృతి చెందాడని ధ్రువీకరరించారు. ఆదినారాయణకు భార్య వెంకటేశ్వరమ్మ, వివాహం అయిన ఇద్దరు కుమార్తెలున్నారు.

చలివేంద్రాన్ని తగలబెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో తమ తండ్రి జ్ఞాపకార్థం కుమారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున తగలబెట్టారు. సేకరించిన వివరాల ప్రకారం గరికె బాలాజీ జ్ఞాపకార్థం ఆయన కుమారులైన దుర్గారావు, సూరిబాబు, గోపిలు ప్రతి సంవత్సరం వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ సంవత్సరం కూడా ఉండవల్లి సెంటర్‌లోని తాడేపల్లి రోడ్‌లో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేశారు. అయితే ఈ చలివేంద్రానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా తగలబడింది. ఘటనపై తాడేపల్లి పోలీసులు ఇద్దరు అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పల్నాడుజిల్లా పరిధిలో 30 పరీక్షా కేంద్రాలలో మొదటి సంవత్సరం పరీక్షకు 95.01 శాతం, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 87.50 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండవరోజు మంగళవారం ఇంగ్లిష్ పరీక్షకు సెట్–2 ప్రశ్నాపత్రాన్ని లాటరీ ద్వారా ఎంపిక చేశారు. జూనియర్ ఇంటర్‌కు 5,708 మంది జనరల్ విద్యార్థులకు గాను 5,439 మంది హాజరు కాగా 269 మంది గైర్హాజరయ్యారు. అలాగే 264 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 235 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు జనరల్ విద్యార్థులు 265 మందికి గానూ 237 మంది, ఒకేషనల్ విద్యార్థులు 23 మందికి గాను 15 మంది హాజరయ్యారు. జిల్లా పరిధిలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.సుచరిత తెలిపారు.

నులకపేటలో కారు బీభత్సం

పలు వాహనాలను ఢీకొట్టిన వైనం.. ఇద్దరికి గాయాలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై నులకపేట వద్ద ఓ కారు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం నులకపేట వినాయకుడి గుడి వద్ద మంగళగిరి నుంచి వస్తున్న కారు ఎదురుగా వెళుతున్న ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాన్ని, సోడా బండిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిని ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. రోడ్డు పక్కనే ఉన్న సోడా బండి, ద్విచక్రవాహనం దెబ్బ తిన్నాయి. ఢీకొట్టిన కారు యజమాని పరారవుతుండగా స్థానిక యువకులు వెంబడించి నులకపేట సెంటర్‌లో అడ్డుకున్నారు. కారు డ్రైవ్ చేస్తున్న యువకుడు గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకువెళతాను, దెబ్బతిన్న వాహనాలను బాగు చేయిస్తానని మాయ మాటలు చెప్పి అక్కడి నుంచి జారుకున్నాడు. జరిగిన ఈ సంఘటనపై సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేసి బాధితుల దగ్గర నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని తెలిపారు.